



# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 07-02-2024 సంపుటి : 06 సంచిక : 150 పేజీలు : 8 వెల : రూ 3-00



# ఏపీలో రసవత్తరంగా పొత్తుల రాజకీయం..

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నా కొద్దీ ఏపీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎలాగైనా జగన్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న పట్టుదలతో ఉన్న టీడీపీ-జనసేన పొత్తులపై తీవ్ర కసరత్తులు చేస్తున్నాయి. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైన ఈ తరుణంలో బీజేపీ కూడా వీళ్లతో కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఏపీలో 2014 ఎన్నికల నాటి సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఈ విషయం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పట్నుంచో చెబుతూనే ఉన్నాడు. దీనిపై చాలాసార్లు ప్రకటనలు కూడా చేశారు. ఈ క్రమంలోనే సీట్ల పంపకాలపై కూడా తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ నెల 5 వ తేదీ (సోమవారం ) దాదాపు 4 గంటల పాటు సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించారు. అయినప్పటికీ ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఇవాళ కూడా భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటుతో పాటు ఏ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ భేటీలో సీట్ల పంపకాలపై చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఫిబ్రవరి 8వ తేదీన మరోసారి భేటీ కావాలని టీడీపీ, జనసేన నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పొత్తులపై నిర్ణయం తీసుకునే దిశగా కసరత్తులు కూడా చేస్తోంది. టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయడంపై ఇవాళ రాత్రిలోగా బీజేపీ అధిష్ఠానం ఒక స్పష్టతనిచ్చే ఛాన్స్ ఉంది. బీజేపీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లనున్నారు. అక్కడ బీజేపీ జాతీయ నేతలతో సంప్రదింపులు జరిపి పొత్తుల అంశాన్ని ఓ కొలిక్కి తీసుకొస్తారని సమాచారం. ఫిబ్రవరి 8వ తేదీన టీడీపీ, జనసేన భేటీ ఉన్న నేపథ్యంలో ఆలోపే బీజేపీతో పొత్తులపై క్లారిటీ తీసుకొని.. సీట్ల సర్దుబాటును ఖరారు చేసే అవకాశం ఉంది. అదే నిజమై.. టీడీపీ-జనసేన-బీజేపీ మధ్య కుదిరితే 2014 ఎన్నికల నాటి పరిస్థితులు పునరావృతమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రెండోరోజు మొదలైన ఎపి అసెంబ్లీ



**ధరలపై టిడిపి వాయిదా తీర్మానం**
**చర్చకు పట్టుబట్టిన తెలుగుదేశం**
**తిరస్కరించిన స్పీకర్ తమ్మినేని**
**పోడియం వద్ద ఆందోళనకు దిగిన సభ్యులు**
**ఒకరోజు సస్పెండ్ చేసిన స్పీకర్**

అమరావతి,ఫిబ్రవరి6( ఏపీ అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యులను స్పీకర్ తమ్మినేని సీతారాం సస్పెండ్ చేశారు. ఒక రోజు పాటు టీడీపీ సభ్యులను సస్పెండ్ చేశారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టారు టీడీపీ ఎమ్మెల్యేలు. ధరల పెరుగుదలపై చర్చించాలని సభలో టీడీపీ గట్టిగా డిమాండ్ చేసింది. పేపర్లు చింపి విజిల్స్ వేస్తూ టీడీపీ సభ్యుల ఆందో ళన చేశారు. స్పీకర్ పోడియంను చుట్టుముట్టిన సభా కార్యక్రమాలకు ఆటంకం కల్గించారు. రెండో రోజు సభ ప్రారంభమైనప్పటి నుంచి కూడా టీడీపీ సభ్యులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. సభాపతి పలు మార్లు వారిని సముదాయించే ప్రయత్నం చేస్తున్నా పట్టించుకోలేదు. ఈ గందరగోళం మధ్య వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానపై చర్చను ప్రారంభించాలని ఆదేశించారు. వాయిదా తీర్మానాలు తిరస్కరిం చడాన్ని టీడీపీ సభ్యులు తప్పుపట్టారు. నిత్యవసరాల ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అందుకే ధరల అంశాన్ని ప్రాధాన్య క్రమంలో తీసుకోవాలని పట్టుప ట్టారు. ఈ డిమాండ్‌తోనే అసెంబ్లీ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. అక్కడే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విజిల్స్ వేశారు. సభలో టీడీపీ సభ్యుల ప్రవర్తించిన తీరును వైసీపీ సభ్యులు తప్పుపట్టారు. రెడ్‌లైన్ దాటిన వారిపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. అనుచిత ప్రవర్తన సరికాదని హెచ్చరించారు. వారి ప్రవర్తన ప్రజలు చూస్తున్నారని వారిని కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపిస్తారని అభిప్రాయపడ్డారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడిన ఎమ్మెల్యే సుధాకర్ బాబు... ప్రజాసమస్యలపై టీడీపీ సభ్యులకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అందుకే జరుగుతున్న అభివృద్ధిని ప్రస్తావిస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుపై చర్చించినా ఓర్వలేకపోతు న్నారని అన్నారు. సంప్రదాయాలు పాటించడంలేదని.. . స్పీకర్ పోడియం వద్దకు వెళ్లడమే తప్పనుకుంటే.. ఆయనపై పేపర్లు చించి వేయడం ఏంటని ప్రశ్నించారు. మధ్యలో అంబటి రాంబాబు కూడా లేచి టీడీపీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను రెచ్చగొట్టొద్దని సూచించార. స్వచ్ఛందంగా వాకౌట్ చేసి వెళ్లిపోవడమా... స్పీకర్‌తో వేటు వేయించుకొని వెళ్లడమా.. మార్షల్స్‌తో నెట్టించుకోవడమా అనే ఆప్షన్లు ఉన్నాయని తెలిపారు. వాళ్లుకు నచ్చిన ఆప్షన్‌ను ఎంచుకోవాలని సూచించారు. మొదటి రోజు నుంచి ఇదే తీరున టీడీపీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రస్తుతం ఈ విడతలో ఆఖరి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశా ల్లోనే ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. బుధవారం ఉదయం సభ ముందుకు బడ్జెట్ తీసుకురానున్నారు ఆర్థిక మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి. ఈ సమావేశాల్లో మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్ర పథాన నిలిపేందుకు నిర్విరామంగా కృషి చేస్తోందని తెలిపారు. మొదటి రోజు కూడా టీడీపీ సభ్యులు సభను వాకౌట్ చేశారు. గవర్నర్‌తో ప్రభుత్వం అబద్దాలు చెప్పించిందని ఆరోపిస్తూ సభ నుంచి బయటకు వచ్చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ప్రజలకు మేలు చేయాల్సిన సర్కారు ఇలా కీడు చేస్తూ సభలో కీర్తించుకుంటోందని మండిపడ్డారు. ఈ క్రమంలో ఏపీ అసెంబ్లీలో ఆందోళన చేస్తున్న టీడీపీ సభ్యులను ఒకరోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు మొదలైనప్పటి నుంచి టీడీపీ సభ్యులు తమ నిరసనలతో హోరెత్తించారు. నిత్యావసర వస్తువుల ధరలపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టగా అందుకు స్పీకర్ తిరస్కరించారు. దీంతో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. సభలో ఏం జరుగుతోంది తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే స్పీకర్ టీ బ్రేక్ ఇచ్చారు. టీ బ్రేక్ అనంతరం సభ పున:ప్రారంభమవగా.. మళ్ళీ వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. సైకో పోవాలి... సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు.

## ఎందుకు పనికొస్తుంది ఆ అనుభవం..

**అసెంబ్లీలో సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు..**




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీ సాక్షిగా ప్రత్యేక హోదాపై మరోసారి స్పందించారు. విభజన చట్టంలో కనీసం హోదా అంశాన్ని రాసి ఉంటే బాగుండేది!..కోర్టుకు వెళ్లయినా సరే సాధించుకునే వీలు ఉండేది!.. ఇప్పుడు, కేంద్రం ఇస్తే తప్ప మాట్లాడలేని పరిస్థితి నెలకొందని.. అందుకే కేంద్రంలో ఏపార్టీకీ పూర్తి మెజార్టీ రాకూడదని కోరుకుంటున్నామని జగన్ పేర్కొన్నారు. అప్పుడైనా సరే నిధులు, హోదాపై మాట్లాడే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పాలన అనుభవంపై సీఎం జగన్ సెటైర్లు వేశారు. మాట్లాడితే 14ఏళ్లు అంటారు, ఎందుకు పనికొస్తుంది ఆ అనుభవం.. అనుభవం లేకపోయినా అందరూ ఆశ్చర్యపోయే పాలన అందిస్తున్నామంటూ జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెద్దనగరాలు అవసరమని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రానికి చెన్నై, బెంగళూరు హైదరాబాద్ లాంటి మహానగరం ఉండాలన్నారు. ప్రతి రాష్ట్రానికి ఎకనామిక్ పవర్ హౌస్ ఉండాలి.. హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల చాలా నష్టపోయామని.. అందుకే విశాఖపై ఎక్కువ ఫోకస్ చేస్తున్నామన్నారు. విశాఖపై అసెంబ్లీలో మరోసారి మాట్లాడిన జగన్.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులాంటి నగరాలు ఉంటేనే ఆదాయం వస్తుందన్నారు.

## ఆన్‌లైన్‌లోనే వీఐపి బ్రేక్ దర్శన టిక్కెట్లు

**ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న టిటిడి**
**ఎంబిసి 34 వద్ద క్యూలైన్లలో వేచిచూడకుండా చర్యలు**

తిరుమల,ఫిబ్రవరి 6 : టీటిడి మరో ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల తీసుకునే వారు.. క్యూలైన్ల నిలబడి కష్టపడకుండా... కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం కోసం భక్తులు ఆన్‌లైన్‌లోనే టిక్కెట్లు కొనుగోలు చేసేలా... చర్యలు చేపడు తోంది తిరుపతి తిరుమల దేవస్థానం. క్యూలైన్‌లో భక్తులు నిలబడకుండా ఈ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టింది టీటీడీ. త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటి వరకు చూస్తే (ఎంబీసీ) 34లోని కౌంటర్ దగ్గర వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల కోసం భక్తులు ఎక్కువ సేపు క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. సిఫార్సు లేఖలు అందజేసిన భక్తుల మొబైల్‌కు ఓ లింక్‌తో కూడిన మెసేజ్ పంపుతున్నారు. భక్తులు ఆ లింకుపై క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. అప్పుడు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లించిన తర్వాత టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే ఆప్షన్ ఉంటుంది. రెండు రోజుల నుంచి ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది టీటీడీ. ఈ కొత్త విధానంపై భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ కొత్త విధానాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు చేయబోతోంది. ఇక... తిరుమలలో నిర్వహించిన మూడు రోజుల ధార్మిక సదస్సులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# బటన్ నొక్కితే జగన్ మైండ్ బ్లాంక్ కావాలి



**పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలనేది నా జీవిత ఆశయం**
**తెలుగు జాతి ప్రపంచంలో నంబర్‌వన్‌గా ఉండాలి**
**వలంటీర్లు రాజకీయాలకు దూరంగా ఉండాలి**
**నిరుద్యోగులకు 3వేల నిరుద్యోగ భృతి ఇస్తాం**
**భవిష్యత్‌లో కోతలు లేని నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం**
**జిడి నెల్లూరు రా కదలిరా సభలో చంద్రబాబు**

చిత్తూరు,ఫిబ్రవరి 6( ): ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి సీఎం జగన్ మానసిక ఆందోళనలో ఉన్నారని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఏర్పాటుచేసిన 'రా.. కదలిరా' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్యాయం చేసిన భస్మాసురుడిని ఓటు ద్వారా భస్మం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కితే జగన్ మైండ్ బ్లాంక్ కావాలన్నారు. జగన్‌ను నమ్ముకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది జాగ్రత్తగా ఉండాలని వాలంటీర్లను కోరుతున్నానని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు తీసేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. కావాలనే వారిలో అభద్రతాభావం సృష్టిస్తున్నారు. వాలంటీర్లు ప్రజలకు సేవ చేస్తే మేం వ్యతిరేకం కాదు. కానీ, వైకాపాకు సేవ చేస్తే మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వాలంటీర్లకు రాజకీయాలొద్దు. మంచి పనులు చేసేవారికి సహకరిస్తాం అన్నారు. భవిష్యత్‌లో కోతలు లేని నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నా. పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలనేది నా జీవిత ఆశయం. పెరిగిన సంపద పేదలకు చేరాలనేది నా సంకల్పం. తెలుగు జాతి ప్రపంచంలో నంబర్‌వన్‌గా ఉండాలి. రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిస్తున్నా. వైకాపా ప్రభుత్వం వేధింపులు తట్టుకోలేక గల్లా జయదేవ్ రాజకీయాలు వదులుకున్నారు. రాజకీయ కక్షలతో పరిశ్రమలు తరిమేయడం బాధాకరం. దేశంలో 24శాతం నిరుద్యోగంతో ఏపీ అగ్రస్థానంలో ఉంది. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఉద్యోగం వచ్చేవరకు యువతకు రూ.3వేలు భృతి ఇస్తాం అని హామీ ఇచ్చారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకువచ్చామని అన్నారు. పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలనేది తన జీవితాశయమని తెలిపారు. పెరిగిన సంపద పేదలకు చేరాలనేది తన సంకల్పమని అన్నారు. తెలుగు జాతి ప్రపంచంలో నెంబర్‌వన్‌గా ఉండాలని చంద్రబాబు ఆకాక్షించారు. వైసీపీను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారరని, రాతియుగం వైపు ఏపీ వెళ్లకుండా స్వర్ణయుగం వైపు వెళ్లాల్సి ఉందన్నారు. ఓడిపోతామని తెలిసి జగన్ మానసిక ఆందోళనలో ఉన్నారు. వైసీపీ హయాంలో ప్రజలపై ధరల పెంపుతో పాటు పన్నుల భారం మోపారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలు పెరిగిపోయాయి. ఏపీలో ఉపాధి లేక వలస వెళ్లే దుస్థితి ఉంది. వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదు.. ప్రజలకు సేవ చేయాలన్నారు. వలంటీర్లు వైసీపీకు సేవ చేస్తే టీడీపీ అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టం అన్నారు.

# సంపాదకీయం

బుధవారం 07-02-2024

## ఉపాధిపై సమన్వయ లోపం !

గ్రామీణ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు లేకుండానే కేంద్ర,రాష్ట్రాల పాలన సాగుతోంది. గ్రామాలను పరిపుష్టం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగాల కల్పన అన్నది జరగడం లేదు. దీంతో పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. అయినా దీనిని పట్టించుకోవడం లేదు. వ్యవసాయాధారిత పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. నీరుగారుతున్న ఉపాధిహామీ పథకం ప్రగతి వైపు పరుగెత్తేలా చేస్తేనే.. గ్రామాల్లో అభివృద్ధి సాకారం కానుంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధులకు కోత విధించారు. మొత్తంగా దీనిని ఎత్తి వేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఉపాధికి నిధులు తగ్గించడంపై అన్నిపార్టీల వారు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధిని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధి దోహద పడాల్సి ఉంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం కాగలదు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాల్సి ఉంది. అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలి. గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీ చేయాలి. పనులు జరుగుతున్నాయా లేదా అన్నది సమీక్షించాలి. నిధులు దుర్వినియోగం కాకాకుండా ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూసుకో వాలి. ఇలా చేస్తూ పోతే కొంతకాలానికైనా అభివృద్ధి కళ్లకు కనిపి స్తుందనడంలో సందేహం లేదు. ఓ పక్క గ్రామాల్లో కూలీ దొరక్క అల్లాడుతున్న పేదలకు నిరాశను మిగిలిస్తోంది. కూలీ దొరకడం లేదని కూలీలు అంటున్నారు. కూలీలు దొరక్క అసవ్థలు పడుతున్నామని రైతులు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. మరి వీరంతా ఏమవుతున్నారు. ఎక్కడ లోపం ఉంది. ఎక్కడ సమన్వయం లోపించింది. అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. ప్రధానంగా కేంద్ర,రాష్ట్రాల మధ్య సమన్వయం కుదరడం లేదు. పనుల విషయంలో ప్రణాళికలు లేవు. వేలాది కోట్లు ఉపాధిహామీలో వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరులా తయారయ్యింది. గ్రామాల్లో పనులు దొరక్క.. చేతిలో డబ్బులు లేక..నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు పనులు కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో కేందప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం.. 52రకాల పనులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మట్టికట్టలు, బావుల పూడికతీత, నాడేపు కంపోస్టు, వర్మీకంపోస్టు నిర్మాణాలు, వంట గదులు, పాఠశాలల మరుగుదొడ్లు, శ్మశానవాటికలు తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. పనులు చాలా ఉన్నప్పటికీ.. వాటిని చేయించడంలో గ్రామీణ స్థాయిలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తు న్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దంన్నర దాటినా ఇంతకాలం ఉపాధి పనులను చూస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఉపాధి హామీని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకునే వెసలుబాటు ఉండాలి. ఆస్తులను సృష్టించేలా కార్యక్రమాలు ఉండాలి. నిధులను సంపూర్ణంగా వినియోగిం చుకునేలా ఉండాలి. అలాగే ఆయా రాష్ట్రాల సలహాలు తీసుకుని..వారి స్వేచ్ఛమేరకు ఉపాధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామాల్లో హరితహారం, వైకుంఠ ధామాలు, చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ రోడ్లు, పేదలకు ఇంటి నిర్మాణాలు, కాలువల నిర్మాణాలు,రైతులకు కల్లాల నిర్మాణం ..ఇలా అనేకానేక పనులను గుర్తించాలి. ముందుగా రాష్ట్రాలను సంప్రదించడం ద్వారా ఏయే పనులు చేపట్టవచ్చో కేంద్రం రాష్ట్రాల నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా దీనిని గ్రామాల అభవృద్ధికి మూలకేంద్రం చేయాల్సి ఉంది.. వారంతా ఉపాధి పథకం,నిధులు, వినియోగంపై తెలుసుకుని తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునే ప్రణాళికలు సిద్ధం చేయాలి. అప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పట్టాలకు ఎక్కుతుంది. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చేయాలి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలి. హరితహారం, శ్మశానవాటికల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, రైతులకు కల్లాలు,చెరువుల పునరుద్ధరణ వంటివన్నీ నిర్మాణం చేయాలి. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలి. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. . మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామ పంచాయతీలు చేపట్టాలన్న సూచనలు సర్పంచ్‌లకు స్ఫూర్తి కావాలి.అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. వారందరికి నిధులకు ఇబ్బంది లేకుండా ఉపాధి జోడింపు కావాలి. ఇకపోతే రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ లేని గ్రామాలు ఉన్నాయి. అలాంటి గ్రామాల సర్పంచ్‌లు చొరవ తీసుకుని ముందుకు సాగాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. దరిమిలా వీరంతా తమ గ్రామాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి, పనులు ప్రారంభించేలా కార్యక్రమాలు రూపొందాలి. అప్పుడే గ్రామీణ నిరుపేదలకు కూలీ కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం లక్ష్యం నెరవేరగలదు. ఇంతకాలం సిబ్బంది నిర్లక్ష్యం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేమితో ఉపాధి పథకం నీరుగారి పోతోంది.

## యువత నోటుతో కాకుండా ఓటుతో నాయకుల కళ్లు తెరిపించండి

### అభిరుచి మదు బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06- యువత నోటుతో కాకుండా ఓటుతో నాయకులకు బుద్ధి చెప్పాలని నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. యువతలో రాజకీయ మేధస్సు అద్భుతం ఉందన్నారు .నంద్యాలపట్టణంలో మంగళవారం నాడు గుడ్ మార్నింగ్ యూత్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఉదయాన్నే ఆయన యువత ఉండే ప్రాంతాల్లో పర్యటించారు.వాకింగ్,క్రీడలు,జిమ్ తదితర ప్రాంతాల్లో యువతతో ముచ్చట్లు పెట్టారు.యువత హాయ్ అన్నా మీరేనా అభిరుచి మదు అంటూపరిచయంచేసుకొని కాసేపు సరదాగా మాట్లాడుకుంటూ రాజకీయం వైపు దృష్టి మళ్లించారు.రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ,ప్రపంచ రాజకీయాలు మాటల్లో చెప్పుకొచ్చారు.యువత రాజకీయ మేధస్సు అబ్బురపరచింది.యువత మాటల్లో రాజకీయ నాయకులు పదవుల కోసం ఉచిత పథకాలు పెట్టీ పేద ప్రజలను ఆకర్షిస్తూ పదవులు పొందుతున్నారని అన్నారు.దేశ వ్యాప్తంగా యువత మంచి,మంచి చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పెద్దలు యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా చూడాలని కోరారు.ఉచితాలకంటే ఫ్యాక్టరీలు నెలకొల్పితే సొంత కాళ్ళ మీద నిలబడి కుటుంబాలను పోషిస్తారని అన్నారు.నాయకులు భావితరాలను దృష్టిలో పెట్టుకొని బంగారు ఆలోచనలు చేయాలన్నారు.అనంతరం అభిరుచి మదు మాట్లాడుతూ యువతలో రాజకీయంగా ఇంత మేధస్సు ఉందని ఊహకు కూడా అందలేదని అన్నారు.యువత నోటు తో కాకుండా ఓటుతో నాయకుల కళ్ళు తెరిపించాలని అన్నారు.పరిశ్రమలు స్థాపిస్తే యువతతో పాటు అన్ని వర్గాలు సంతోషంగా వుంటాయని అన్నారు.

## ఆశా సమస్యల పై 8న చలో విజయవాడ....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 6 ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 8న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,డోన్ మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు,ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు భాగ్యమ్మ,కృష్ణవేణి,చౌడేశ్వరి ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్లు దీవనమ్మ,వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ కి కనీస వేతనాలు చెల్లించాలని,పని భారాన్ని తగ్గించాలని,ప్రభుత్వ సెలవులు,రిటైర్మెంట్ బెనిఫిట్స్,గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,ఆశా నియామకాలలో రాజకీయ జోక్యం అరికట్టాలని,ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలని,రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్లకు పెంచాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్5 లక్షలు ఇచ్చిన తర్వాతే రిటైర్మెంట్ చేయాలని, వేతనంలో సగం పెన్షన్ఇవ్వాలని,మరణించిన వారి కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆశాలు 18 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని ప్రభుత్వం వారి సేవలను గుర్తించి కార్మికులుగా పరిగణించాలని ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు.ఆశా వర్కర్లను విలేజ్ క్లినిక్ లు మరియు సచివాలయాల నందు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని,క్లినిక్లు క్లీన్ చేయడం,ఓపి వర్క్,అటెండర్ పనులు చేయడంతో పాటు ఉదయం సాయంత్రం రెండుసార్లు రిజిస్టర్లలో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారన్నారు,రికార్డ్స్ సొంత డబ్బులు పెట్టి కొనాలని,సంబంధంలేని ఆన్లైన్ వర్కులన్నీ సొంత ఫోన్ ద్వారా చేయాలని వేధిస్తున్నారన్నారు.సెలవులు లేకపోవడం,సంబంధం లేని పనులు చేయించడం వల్ల పని ఒత్తిడితో ఆశాలు అనారోగ్యాల పాలు అవుతున్నారని వీటిని వెంటనే ఆపాలన్నారు.గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు.నాలుగున్నర సంవత్సరాలుగా అనేక రకాలుగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పీరాంబి,శాంతకుమారి,సునీత,రేణుక,దేవమ్మ,కృష్ణవేణి,పుల్లమ్మ తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 6 జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా డోన్ లో ఉన్న గవర్నమెంట్ మరియు ప్రైవేట్ హాస్పిటల్స్ నందు హాస్పిటల్ సిబ్బంది తో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు గుడ్ సమారిటన్ చట్టంలో కొన్ని నియమాలు గురించి ఈ క్రింది తెలిపిన విధంగా వివరించడం జరిగిందిగుడ్ సమారిటన్ అనగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆ సంఘటనతో సంబంధం లేకపోయినా గాయపడిన వారినుండి ఎటువంటి ప్రతిఫలము ఆశించకుండా సహాయము చేయు వ్యక్తి రోడ్డు ప్రమాదం గురించి సమాచారము ఫోను ద్వారా పోలీసులకు లేదా అత్యవసర సర్వీసు కు తెలియజేసిన లేదా గాయపడిన వారిని హాస్పిటల్ కు తీసుకుని వచ్చిన యెడల ఆ తీసుకొని వచ్చిన వ్యక్తి గుడ్ సమారిటన్ యొక్క వ్యక్తిగత వివరాలను తెలుపమని పోలీసులు ఒత్తిడి చేయరాదు ఆ వ్యక్తి అక్కడి నుండి వెళ్ళిపోవడానికి అభ్యంతరము పెట్టరాదు అన్ని ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆసుపత్రులు తమ ప్రవేశ ద్వారం వద్ద ఒక చార్టర్‌ను ప్రచురించాలలిరోడ్డు ప్రమాదానికి సంబంధించిన అత్యవసర పరిస్థితిలో వైద్యుడు స్పందించకపోవటం వలన అటువంటి వైద్యుడు లేదా ఆసుపత్రిపై క్రమశిక్షణా చర్య తీసుకోబడుతుంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి గోల్డెన్ హవర్లో హాస్పిటల్ నందు చేర్పించిన గుడ్ సమారిటన్ కు ప్రోత్సాహక బహుమతి అందించబడుతుంది ఒక గుడ్ సమానిటర్ ఒకరు లేదా ఎక్కువమంది క్షతగాత్రులను రక్షించిన అతనికి రూపాయలు 5000/-ఒక ప్రమాదంలో ఒకరి కంటే ఎక్కువ గుడ్ సమారిటన్లు ఒకరి కంటే ఎక్కువ మంది క్షతగాత్రులను రక్షించినచో ఒక్కో క్షతగాత్రునికి 5000 చొప్పున ఒక గుడ్ సమారిటన్ కు 5000 మించకుండా ఇవ్వబడును అని ఆయన తెలిపారుఈ కార్యక్రమం లో గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిండెంట్ ఆతీ.హనీఫ్ ,ఆతీ. సుకుమార్ మరియు ఆతీ.జార్జ్ మరియు ప్రైవేట్ హిస్పిటల్ ఆతీ.మధురామకృష్ణ మరియు ఆతీ.అనిత రెడ్డి పాల్గొన్నారు

## జర్నలిస్టులకు జాగా ఎక్కడ ?

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06-స్వచ్ఛంద సమాజ సేవకులు జర్నలిస్టులు ఎటువంటి జీతభత్యాలు లేకుండా సమాజం కోసం అహర్నిశలు పనిచేస్తూ ఇటువైపు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారు . ప్రభుత్వాలు మాత్రం వారి సమస్యల వైపు తొంగి చూడడం లేదు. ఒకవైపు కడుపులు కాలుతున్న రాజకీయ మీటింగులలో వారి ప్రసంగాన్ని వింటూ వారి ప్రసంగాన్నే కడుపు నింపుకొని ప్రజలకు వార్తగా మలుస్తున్న విలేకరులు ఎందరెందరో ! ఉండడానికి ఇల్లు లేక వారు పనిచేస్తున్న సంస్థల నుండి ఎటువంటి జీతభత్యాలు లేక కుటుంబ బీమా సౌకర్యం కూడా లేకుండా కుటుంబం భారమై తమ బాధ్యతను భారంగా భరిస్తున్నారు. ఎలక్షన్లలో జర్నలిస్టుల పైన ఎక్కడలేని ప్రేమను ఉలకబొస్తుంటారు. గత ప్రభుత్వం నుండి నేటి ప్రభుత్వం వరకు ఇల్లు లేని నిరుపేద జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ వారి పేర్లను మాత్రం అర్హత లిస్టులో పెట్టి వారిని మభ్యపెడుతున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా తమకు స్థలాలు వచ్చేనా! అని జర్నలిస్టులు ఎదురు చూస్తున్నారు . ఫిబ్రవరి వచ్చిన జర్నలిస్టుల ఇంటి స్థలాలపై ఎటువంటి పురోగతి లేకపోవడంతో అవురా! అంటున్నారు. మరోవైపు ఎలక్షన్ కోడ్ దగ్గర పడుతుండడంతో వారి ఆశలు అడియాశలవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ ప్రభుత్వమైనా మాకు ఇళ్ల స్థలాలను కేటాయించి మమ్మలను ఆదుకోవాలని జర్నలిస్టులు కోరుకుంటున్నారు

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి

### సమావేశంలో పాల్గొన్న నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 06 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన అన్నారు. ఎన్నికల నియమావళి గురించి రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ నజీర్ అహ్మద్ తో పాటు రుద్రవరం సిరివెళ్ల ఉయ్యాలవాడ దొర్నిపాడు చాగలమర్రి మండలాల తహసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు, ఆళ్లగడ్డ ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖరయ్యతో పాటు , రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొత్తగా ఐదు ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు



నూతన ట్రాన్స్ఫార్మర్ కు పూజ నిర్వహిస్తున్న డిఈఈ రవికాంత్ చౌదరి

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 06 విభారె న్యూస్ :- పట్టణంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని లో- వోల్టేజ్ సమస్య నివారించుట కొరకు సుమారు 31 లక్షల రూపాయలతో కొత్తగా ఐదు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగినిది.. అందులో భాగంగా పట్టణంలోని ఎండిఓ కార్యాలయం సమీపంలో, కూరగాయల మార్కెట్ , నాగుల కట్ట, గర్ల్స్ హైస్కూలు మరియు కోవెలకుంట్ల రోడ్డులో ఈ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఈఈ రవికాంత్ చౌదరి మాట్లాడుతూ విద్యుత్ సబ్ డివిజన్ లోని వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి తమకు సహకరించాలన్నారు. కరెంటు బిల్లు ఇచ్చిన రోజు నుంచి 14 రోజులలో బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ హుస్సేన్ భాష, లైన్స్పెక్టర్ రమణయ్య మరియు అమీర్ భాష ఫోర్ మెన్ ప్రతాప్, లైన్మెన్లు నాగరాజు, ఖలీల్, సుబ్బారావు, నజీర్ కాంట్రాక్టర్ రాము మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి సమీపంలో బస్సు బోల్తా?.

### 18 మంది ప్రయాణికులకు గాయాలు

తిరుపతి,తిరుపతి సమీపంలోని బాలాజీ డైరీ దగ్గర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును టిప్పర్ రాంగ్ రూట్ లో వచ్చి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో బస్సు బోల్తా పడింది.18 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు రుయా హాస్పిటల్ కు తరలించారు. తిరువణ్ణామలై నుంచి 42 మంది ప్రయాణికులతో తిరుపతి వస్తుండగా అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సీసీ కెమెరాల ఆధారంగా ఘటనకు కారణమైన టిప్పర్ ను పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి ఎం.అర్.పల్లి పోలిసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పంజాగుట్టలో డ్రగ్స్ గుట్టు రట్టు

హైదరాబాద్ ,హైదరాబాద్ పంజాగుట్ట లో భారీగా డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు అయింది. ఘటనలో మోస్ట్ వాంటెడ్ ఇంటర్నేషనల్ డ్రగ్స్ పెడ్లర్ అరెస్ట్ అయినట్లు సమాచారం. నైజీరియా కి చెందిన వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్టు చేసారు. భారీగా డ్రగ్స్ సీజ్ చేసారు.

## కౌలు రైతు ఆత్మహత్య

పల్నాడు ,పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చి పావన్నపాలేం గ్రామానికి చీమల అంజిరెడ్డి అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు బాధ భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నరసారావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామంకుడా బుచ్చి పాపన్న పాలేం గ్రామమే.

## ఉయ్యూరులో ఉద్రిక్తత

ఉయ్యూరు,పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ తలపెట్టిన అమరావతి “ఛలో అసెంబ్లీ” ముట్టడకి అనుమతి లేదని పోలీసులు ఉయ్యూరులో హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం రాజేంద్ర ప్రసాద్ ఛలో అసెంబ్లీకి బయలుదేరారు. ఉయ్యూరు టౌన్, రూరల్ పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ప్రసాద్ బయటకు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ఇంటివద్దకూర్చొని ప్రభుత్వ వైఖరిపై రాజేంద్ర నిరసన తెలిపారు.

### స్పీకర్ పోడియం ముట్టడించిన టిడిపి సభ్యులు

అమరావతి,ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండవ రోజు మంగళవారం ప్రారంభం అయ్యాయి. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియాన్ని ముట్టడించారు. స్పీకర్ పై కాగితాలు విసిరి వేస్తూ టిడిపి సభ్యులు కోరిన 8 అంశాలపై చర్చించమని డిమాండ్ చేశారు. తరువాత సభను బాయ్ కాట్ చేస్తూ బయటికి వెళ్లిపోయారు.కొద్దిసేపు వాయిదా తరువాత సభ కొనసాగింది.

### వైకాపా దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలు

పల్నాడు పల్నాడు జిల్లా నరసరావుపేట రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామంలో టీడీపీ కార్యకర్త గొల్లపుడి శ్రీనివాసరావు పై వైసీపీ శ్రేణులు దాడి జరిపాయి. ఘటనలో శ్రీనివాసరావు రెండు కాళ్ళు విరగిపోయాయి. శ్రీనివాసరావును నరసరావుపేట ఆసుపత్రికు తరలించారు. నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ డా??చదలవాడ అరవింద బాబు శ్రీనివాసరావును పరామర్శించారు.

# సీట్లపై ఇంకా రాని క్లారిటీ

విజయవాడ, ఫిబ్రవరి 6 ఏపీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చిన టీడీపీ, జనసేనలు.. అభ్యర్థుల ఎంపికపై దృష్టిపెట్టాయి. ఇదే అంశంపై ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో రెండు పార్టీల అధినేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. నిన్న మధ్యాహ్నం 3గంటల పాటు సమావేశమైన లీడర్లు.. రాత్రి మరోసారి సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపారు. 45నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో ఇరుపార్టీలు.. దాదాపు స్పష్టతకు వచ్చాయి. ఈ నెల 8న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. ఆ తర్వాత.. బహిరంగ సభలో మేనిఫెస్టోను విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే మూడుసార్లు సమావేశమైన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఉమ్మడి మేనిఫెస్టో, సీట్ల సర్దుబాటుపై విడతలవారీగా చర్చించారు. నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోనే మకాం వేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్.. ఆయా పార్టీల అభ్యర్థుల ఎంపికపై విడివిడిగా కసరత్తు చేశారు. తాజాగా ఉండవల్లిలో భేటీ అయిన ఇద్దరు అధినేతలు.. కీలక అంశాలపై చర్చించారు. జనసేన పోటీ చేసే స్థానాల్లో టీడీపీ ఆశావహులకు.. టీడీపీ పోటీ చేసే స్థానాల్లో జనసేన ఆశావహులకు ఇరు పార్టీల అధినేతలు సర్ది చెప్పనున్నారు.మండపేట, అరకు స్థానాల్లో పోటీ చేస్తామని ఇప్పటికే స్పష్టత నిచ్చిన చంద్రబాబు.. ఆయా స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను కూడా ప్రకటించారు. దానికి పోటీగా.. రాజానగరం, రాజోలు స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు పవన్ కల్యాణ్. దీంతో మిగిలిన సీట్లపై స్పష్టత రావాల్సి ఉంది. కొందరు నేతలు త్యాగాలకు సిద్ధం కావాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా నేతలకు ఇప్పటికే చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. పొత్తులో సీటు సర్దుబాటు కాని నేతలకు.. పార్టీ, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సిట్టింగ్ స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలకే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. దీంతో పట్టు, విడుపులకు సిద్ధంగా ఉన్నట్టు సిగ్నల్ ఇచ్చారు చంద్రబాబు.అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వరుస జాబితాలు ప్రకటిస్తుండటంతో టీడీపీ-జనసేన నేతలపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు సీట్ల సర్దుబాటుపై అధికారిక ప్రకటన ఎప్పుడెప్పుడా అని ఇరు




పార్టీల నేతలు, కార్యకర్తలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే బీజేపీతో పొత్తు అంశం ఎటూ తేలకపోవడం వల్లే సీట్ల ప్రకటన ఆలస్యం అవుతున్నట్టు తెలుస్తోంది. తాను ఇప్పటికీ ఎన్డీఏలోనే ఉన్నానని పవన్ కల్యాణ్ చెబుతుండగా.. అటు బీజేపీ కూడా జనసేన తమ భాగస్వామ్య పార్టీ అని బీజేపీ చెబుతోంది. కానీ టీడీపీతో కలిసి పోటీ చేసే అంశంపై మాత్రం.. బీజేపీ స్పష్టత నివ్వడం లేదు. ఒకవేళ బీజేపీ ఒంటరిపోరుకు దిగితే ఏం చేయాలన్నదానిపై కూడా టీడీపీ, జనసేన అధినేతలు చర్చించినట్టు తెలుస్తోంది.రెండు పార్టీలు పోటీ చేసే చాలా స్థానాలపై క్లారిటీ వచ్చినా.. మరికొన్ని స్థానాలపై స్పష్టత ఏమి రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల నేతలిద్దరూ మరోసారి ఫిబ్రవరి 8న భేటి కానున్నారు. ఆ సమయంలో మొత్తం సీట్లపై స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం అందుతోంది. మరోవైపు పార్లమెంట్ సమావేశాల తర్వాత పవన్ కళ్యాణ్.. బీజేపీతో పొత్తు విషయంపై ఢిల్లీ వెళ్లే ఛాన్స్ ఉందట. అప్పుడే టీడీపీ-జనసేన పొత్తుపై ఓ స్పష్టత వస్తుందంటున్నాయి టీడీపీ వర్గాలు. అలాగే ఈ నెల 14న పాలకొల్లులో టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభపై కూడా ఎలాంటి స్పష్టత లేదు. పొత్తులపై స్పష్టత అనంతరం.. మేనిఫెస్టో, బహిరంగ సభపై నిర్ణయం తీసుకుంటామంటోంది టీడీపీ కేడర్.

# కోటిపల్లి రైల్వే లైనుకు లైన్ క్లియర్

రాజమండ్రి, ఫిబ్రవరి 6 నత్తనడకన సాగుతున్న కోటిపల్లి- నర్సాపురం కోనసీమ రైల్వేలైను కోసం రూ.300 కోట్లు కేంద్రం కేటాయించింది. దీంతో ఆర్థిక అడ్డంకులతో తీవ్ర జాప్యం జరుగుతోన్న రైల్వే లైను పనులు ముందుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. నిధుల లేమితో ఈ రైల్వే లైను పనులు ఏమాత్రం ముందుకు వెళ్లని పరిస్థితిలో ఉండిపోగా కేవలం గౌతమి, వైనతేయ, వశిష్ట నదీపాయలపై నిర్మాణం జరుపుకుంటున్న వంతెన పనులు పిల్లర్ల వరకు మాత్రమే చేరుకోగలిగాయి. ఇవి కూడా మూడు నదీపాయల్లోనూ ఇంకా పిల్లర్లు నిర్మాణం చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు భూసేకరణ నిమిత్తం పరిహారం, ఇతర సమస్యలు పనుల వేగవంతాన్ని అడ్డుపడుతుండగా రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన నిధులకు సంబందించి భూసేకరణ పూర్తిచేసిఇస్తామని చెప్పడం, అది కేవలం సర్వేలతోనే ఆగిపోవడంతో ఈప్రభుత్వ హాయంలో ఇది పూర్తికాని అంకంగా కనిపిస్తోంది.ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఇది ఇప్పటిలో తేలే అంశం కాకపోగా రాబోయే ప్రభుత్వంలోనే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయితేనే రైల్లే లైనుకు సంబందించి ట్రాక్ నిర్మాణ పనులకు అడుగు ముందుకు పడే అవకాశం ఉంది.. ఇప్పుడు కేంద్రం కేటాయించిన నిధులకు సంబందించి కేవలం నదీపాయలపై పూర్తిస్థాయిలో మూడు వంతెనలు నిర్మాణానికి మాత్రమే సరిపడే అవకాశాలుండగా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా కేటాయించాల్సిన నిధులు విడుదల, భూసేకరణ సజావుగా, నిర్ణీత సమయానికి పూర్తి చేస్తేనే కోనసీమ రైల్వే లైను పనులు కొంతవరకు కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయని రైల్వే లైను సాధన సమితి నాయకులు చెబుతున్నారు.

ముందుకు కదలని ట్రాక్, మౌలిక వసతులు...కోనసీమ వాసులు చిరకాల వాంఛ అయిన కోటిపల్లి?నర్సాపురం రైల్వే లైనుకు సంబందించి ఇప్పటివరకు విడుదలైన నిధుల ద్వారా మూడు నదీపాయలపై వంతెన నిర్మాణాలకు సంబందించి పిల్లర్లకు సంబందించిన పనులు మాత్రమే జరుగుతున్నాయి.. అయితే గతేడాది బడ్జెట్టులో రూ.296.51 కోట్లు నిధులు కేంద్రం కేటాయించింది.. ఈ నిధుల ద్వారా రైల్వే ట్రాక్, స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పిల్లర్లు నిర్మాణం పూర్లయిన వంతెన పైభాగంలో ఐరెన్ రెయిల్స్, బాక్సు గడ్డర్లు ఇతర పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పిలిచింది.. అయితే మూడు నదీపాయలపై పూర్తయ్యిన పిల్లర్లపై ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు.. ఇదిలా ఉంటే ఈ బడ్జెట్టులో రూ.300 కోట్లు నిధులు కేటాయించడంతో రైల్వేలైను పనులు మరింత వేగవంతం అవుతాయని కోనసీమ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.. అదేవిధంగా కాకినాడాకోటిపల్లి రైల్వే ట్రాక్ పునరుద్ధరన కోసం మరో రూ.20 కోట్లు కేటాయించడం కూడా శుభపరిణామమే అంటున్నారు. కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను 57.21 కిలోమీటర్లు దూరం కాగా ఈ రైల్వే లైను నిర్మాణ అంచనా వ్యయం రూ.2,120.16 కోట్లు గా అంచనా వేశారు. అయితే ఈపనులు నానాటికీ జాప్యం అవుతుండడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగిందని నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే కోటిపల్లి?శానపల్లి లంక మధ్య



నున్న గౌతమి నదీపాయపై 3.50 కిలోమీటర్లు మేర వంతెన నిర్మాణం చేపట్టగా ఇప్పటివరకు 45 పిల్లర్లు వరకు నిర్మాణాన్ని పూర్తిచేసుకున్నాయి. ఇక వైనతేయ నదీపాయపై బోడసకుర్రు- పాశర్లపూడి మధ్య నిర్మిస్తున్న వంతెనకు సంబందించి 21 పిల్లర్లు నిర్మించాల్సి ఉండగా 16 వరకు పూర్తికాగా మరో రెండు నిర్మాణదశలో ఉన్నాయి.. వశిష్ట గోదావరి పాయపై నిర్మిస్తున్న వంతెనకు సంబందించి 20 పిల్లర్లుకు 18 పూర్తికాగా మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి.. కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పనులు అత్యంత ఆలస్యంగా నడుస్తున్న ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించింది. 2001 డిసెంబరు నెలలో రూ.1,045.20 కోట్లుతో ఆమోదం పొందిన ఈప్రాజెక్టు షెడ్యూల్ ప్రకారం 2009 మార్చి నాటికి పూర్తికావాల్సి ఉంది. అయితే అనుకున్న సమయానికి ఇది ఏమాత్రం పూర్తికాకపోగా ఇప్పటికే రూ.1,141.44 కోట్లు మేర ఖర్చుచేశారు. అయినా పూర్తికాలేదు. తాజా అంచనాల ప్రకారం రూ.2,500.98 కోట్లు వరకు వెచ్చించాల్సి ఉందని నివేదికలో తేలింది. ఇది గత అంచనాలకు 140 శాతం అధికం.

రాష్ట్ర ప్రభుత్వ వాటా ఏమైంది ?ప్రాజెక్టు నిర్మాణ వ్యయానికి సంబందించి 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వాటాగా రూ.2 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించగా నిధులు విడుదల కాలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రైల్వే లైనుకు సంబంధించి రాష్ట్ర వాటాగా రూ.525 కోట్లు విడుదల కావాల్సి ఉండగా కేవలం రూ.2.69 కోట్లు మాత్రమే ఇంతవరకు విడుదల అయ్యాయి. రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయలే కపోవడం వల్లనే కోనసీమ రైల్వేలైను పనులు తీవ్ర జాప్యం జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే ఈ ప్రాజెక్టుకు సంబందించి 190 హెక్టార్లు మేర భూసేకరణ చేపట్టాల్సి ఉండగా, అడుగు ముందుకు పడడం లేదు. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం భూసేకరణ అంశం వేగంగా జరగుతోందని, దీనికోసం అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెబుతోంది.

# వైసీపీకి మరో ఎమ్మెల్యే రాజీనామా

తిరుపతి, ఫిబ్రవరి 6, చిత్తూరు జిల్లా వైసీపీకి వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ రాజీనామా చేశారు. మెయిల్ ద్వారా జగన్ రెడ్డికి రాజీనామా పంపిపిన మాజీ ఎమ్మెల్యే ఆర్. గాంధీ మీడియా సమావేశంలో వైసీపీ హైకమాండ్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. 12 ఏళ్లుగా వైసీపీలో ఉన్నారు ఆర్. గాంధీ. వైసీపీ లో దళితులకు అన్యాయం జరుగుతోందని.. దళితుల బాధలను, కష్టాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలంటే అపాయింట్మెంట్ దొరకడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెల రోజుల్లో సుమారు వెయ్యి సార్లు జగన్ రెడ్డికి కాల్ చేశాను కానీ వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. ఓ దళిత మాజీ ఎమ్మెల్యేని అయిన నాకు వైసీపీలో అవమానం జరిగింది. దీంతో మనస్తాపానికి గురై రాజీనామా చేశానని ప్రకటించారు. నాడు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నేను వైసీపీలో చేరాను. అప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి తనను చిన్నచూపు చూస్తూ వస్తున్నారని విమర్శించారు. పార్టీ పరంగా దక్కాల్సిన అవకాశాలను పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి దూరం చేస్తూ, అడ్డుపడుతూ వచ్చారని.. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితుల పైన, బీసీల పైన దాడులు పెరిగాయిని విమర్శించారు. వైసీపీ చేస్తున్న అక్రమాలకు వ్యతిరేకంగా నేడు నేను రాజీనామా చేశానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు గారి సమక్షంలో గంగాధర నెల్లూరులో జరగనున్న రా... కదలిరా... సభలో తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నాననని తెలిపారు. దళితులకు ఈ ప్రభుత్వం దగా చేస్తుంది, దీనిని ప్రశ్నించేందుకు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నాను. నేడు చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధిపత్యం నడుస్తోందన్నారు. పెద్దిరెడ్డికి బానిసలుగా ఉన్నారో, అనుకూలంగా ఉన్నారో వారికి ఎమ్మెల్యే సీటు, ఎంపీ సీట్లు వస్తున్నాయని మండిపడ్డారు. జిల్లాలో వైసీపీకి కోనేటి ఆదిమూలం గొప్ప సర్వీస్ చేశారు. అలాంటి దళిత నాయకుడికి కూడా టికెట్ ఇవ్వలేదన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే బాబుకి కూడా సీటు లేకుండా చేశారు. వైసీపీలో కేవలం దళిత ఎమ్మెల్యేలకే టికెట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైసీపీ చేస్తున్న అవినీతి, అక్రమాల మీద పోరాటం చేస్తానని ప్రకటించారు. చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సీపీలో టిక్కెట్ల మార్పు వ్యవహారం కలకలం రేపుతోంది. ముందుగా ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను మార్చడం వివాదాస్పదమవుతోంది.

## తెరపైకి రాజధాని ఫైల్స్

విజయవాడ, ఫిబ్రవరి 6,రాజధాని ఫైల్స్ పేరుతో తెరెక్కిన ఓ సినిమా ఇప్పుడు రాజకీయవర్గాలలోనూ సంచలనం అవుతోంది. దర్శకుడు భాను తెరకెక్కించిన సినిమా రాజధాని ఫైల్స్. నటుడు వినోద్ కుమార్ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా అరుణప్రదేశ్ రాష్ట్ర రాజధాని కోసం తమ భూముల్ని త్యాగం చేసిన వేలాది రైతుల ఆవేదన నేపథ్యంలో తెరకెక్కింది. ఇటీవల విడుదలైన రాజధాని ఫైల్స్ ఫస్ట్ లుక్ కి మంచి రెస్పాన్స్ రాగా.. తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. రాజధాని ఫైల్స్ ట్రైలర్ కూడా ఆసక్తికరకంగా సాగింది. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, వారి జీవితాల్ని చాలా సహజంగా చూపించారు. కష్టపడమని చెప్తే.. ఎవడైనా ఇష్టపడతాడా? సుఖాన్ని నేర్పి పడుకోబెట్టాలి, ప్రజలెప్పుడూ మన దగ్గర చెయ్యి చాచి అడుక్కునే పరిస్థితుల్లోనే ఉండాలి, 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశానికి ఒక్క రాజధాని, 6 కోట్ల జనాభా ఉన్న రాష్ట్రానికి 4 రాజధానులా, ఇది రాజ్యాంగబద్ధమా, వ్యక్తిగత ద్వేషమా.. అంటూ సాగిన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఫిబ్రవరి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమా ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి. ఇది పూర్తిగా కల్పిత కథ అని చెబుతున్నప్పటికీ.. ఏపీలో జరుగుతున్న రాజధాని రాజకీయంపై సినిమా అని ట్రై?ర చూస్తే అర్థమవుతుంది. పరదాల ముఖ్యమంత్రి అంటూ నేరుగా విమర్శనా బాణాన్ని ఎక్కు పెట్టారు. కాసినోలు, బాబాయ్ ? గొడ్డలి ఎపిసోడ్లు అన్నీ ఈ ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి. కచ్చితంగా రాజకీయ దుమారాన్ని రేపే కంటెంట్ ఈ కథలో ఉన్నట్టు కనిపిస్తోంది. భాను దర్శకత్వం వహించి న ఈ చిత్రానికి రవిశంకర్ నిర్మాత. అఖిలన్, వీణ, వినోద్ కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈనెల 15న ముందుకు రానుంది. ఈనెల 9న ‘యాత్ర 2’ విడుదల అవుతోంది. తర్వాత వారానికే ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

## సేవకు ఇతర మతాల వర్గీయులకు అనుమతి..

తిరుమల, ఫిబ్రవరి 6 ,అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి వెళ్లిన ముస్లిం మత గురువుకు వ్యతిరేకంగా మత పెద్దలు ఫత్వా జారీ చేశారు. ఈ అంశం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. తాజాగా తిరుమలలో సేవ చేసేందుకు అనుమతివ్వాలని నాయుడుపేటకు చెందిన హుస్సేన్ భాష అనే ముస్లిం టీటీడీ ఈవోను కోరడంపై కొందరు అతివాద మత పెద్దలు మండిపడుతున్నారు. మరోవైపు వెంకటేశ్వరుడి సేవ చేస్తానంటూ వచ్చిన ముస్లిం భక్తుల అంకిత భావాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి మెచ్చుకుంటున్నారు. తిరుమలలో శ్రీవారి సేవ అనేది 2000లో ప్రారంభించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు సేవలు అందించేందుకు చాలా మంది దరఖాస్తు చేసుకుంటూ ఉంటారు. అయితే, తాను కూడా సేవలో పాల్గొంటానంటూ డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో నాయుడుపేటకు చెందిన ముస్లిం భక్తుడు హుస్సేన్ భాషా ఈవోను అభ్యర్థించాడు.దానికి స్పందించిన ఈవో ధర్మారెడ్డి ముస్లిం భక్తుడి అభ్యర్థనపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సాధారణంగా స్వచ్ఛంద సేవలో పాల్గొనేవారు ఖఆలోని వివిధ రంగాలకు విజిలెన్స్, ఆరోగ్యం, అన్నప్రసాదం, ఉద్యానవనం, వైద్యం, లడ్డూ ప్రసాదం,దేవాలయం,రవాణా, కల్యాణకట్ట, బుక్ స్టాల్స్ దగ్గర సేవ చేసుకోవాల్సి ఉంటుంది.తిరుమల శ్రీవారి ఆలయంలో మాకు కూడా సేవ చేసుకునేఅవకాశంకల్పించాలని ముస్లింల అభ్యర్థనను బీజేపీ నేతలు మాత్రం వ్యతిరేకిస్తున్నారు.మరోవైపుముస్లింలుఇలాశ్రీవారి సేవకు ముందుకురావడం పట్ల భజరంగ్‌దళ్ నేతలు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వాట్ నెక్ట్స్....

విజయవాడ, ఫిబ్రవరి 6, విచారణ తంతు ఎప్పుడో ముగిసింది.! నలుగురు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు, టీడీపీ రెబల్స్‌లో ఒకరు స్పీకర్ ముందు హాజరై వివరణ కూడా ఇచ్చేశారు!. మరి, స్పీకర్ నిర్ణయం ఏంటి?. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతోన్నవేళ స్పీకర్ ఏం చేయబోతున్నారు?. ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు?.జనవరి 29నే స్పీకర్‌కు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు. ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి.. నేరుగా స్పీకర్ ముందు హాజరై తమ వాదనలు వినిపించారు. అయితే, తమపై అభియోగాలకు ఆధారాలు కావాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో తమ వాదనలు వినిపించేందుకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కానీ, గడువు ఇచ్చేందుకు కుదరదని తేల్చిచెప్పిన స్పీకర్ కార్యాలయం.. లిఖితపూర్వక సమాధానాలు అందాయంటూ రెబల్ ఎమ్మెల్యేలకు అక్నాలెడ్జ్‌మెంట్ పంపింది.ఇక, నలుగురు టీడీపీ రెబల్ ఎమ్మె?ల్యేల్లో ఒక్కరే స్పీకర్ ముందు హాజరయ్యారు. వాసుపల్లి గణేష్ మాత్రమే వివరణ ఇవ్వగా? వివిధ కారణాలతో కరణం బలరాం, వల్లభనేని వంశీ, మద్దాలి గిరిధర్ ఇప్పటివరకు అస్సలు హాజరే కాలేదు. అలాగే, జనసేన రెబల్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కూడా వివరణ ఇవ్వలేదు. దాంతో, రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతుందనేది ఉత్కంఠ రేపుతోంది.స్పీకర్ నోటీసులపై ఆల్రెడీ హైకోర్టును ఆశ్రయించారు జఅఖ రెబల్ ఎమ్మెల్యేలు. అయితే ఈ దశలో జోక్యం చేసుకోలేమని చెబుతూనే, విచారణను వాయిదా వేసింది ధర్మాసనం. దాంతో, రెబల్ ఎమ్మెల్యేల అనర్హతపై న్యాయసలహా తీసుకున్నారు స్పీకర్. మరి, ఈ 9మంది రెబల్స్‌పై స్పీకర్ ఏం నిర్ణయం తీసుకుంటారు?. ఎమ్మెల్యేలు కోరినట్టుగా గడువు ఇస్తారా? లేక అనర్హత వేటేస్తారా?. వాట్ నెక్ట్స్? ఏం జరగబోతోంది?.

### పోలీసులపై దూసుకెళ్లిన కారు? కానిస్టేబుల్ మృతి

అన్నమయ్య,అన్నమయ్య జిల్లా కె.వి పల్లి మండలం గుండ్రేవారిపల్లి క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు కుంబింగ్ నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఎర్రచందనం అక్రమంగా తరలితున్న ఓ కారు అతివేగంగా పోలీసులపై దూసుకెళ్ళింది. కారు ఢీ కొనడంతో గణేష్ అనే కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతచెందాడు. దూసుకెళ్లిన కారు కోసం పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కారులో అక్రమంగా తరలిస్తున్న 7 ఎర్రచందన దుంగలతో పాటు ఇద్దరు స్మగ్లర్లు ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఒక స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. కానిస్టేబుల్ గణేష్ మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కౌతాళం మండలం ఎంపీడీవో గా రఘునాథ్ గుప్తా బాధ్యతలు.



కౌతాళం మండలం (విభారె న్యూస్ జనవరి 6) : కౌతాళం మండలమునకు నూతన ఎంపీడీవో గా సోమవారం రఘునాథ్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భముగా ఎంపీడీవోల అంతర్ జిల్లాల బదిలీలో భాగంగా కౌతాళం ఎంపీడీవో సుబ్బరాజును అనంతపురం జిల్లా బెల్లగుప్ప మండలంకు బదిలీ చేయగా, సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న రఘునాథ్ గుప్తా ఇక్కడికి నియమితులయ్యారు. అందరి సహకారంతో కౌతాళం మండల ప్రజలకు శక్తి వంచన లేకుండా తన సేవలు అందిస్తానని తెలిపారు.

## అమ్మాయిల చదువు భవిష్యత్ కి వెలుగు

### – కర్నూలు జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్ డాక్టర్ లింగన్న..





విభారె న్యూస్ ఫిబ్రవరి 06 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..కర్నూలు కలెక్టర్ ఆఫీస్ పరిధిలో ఉన్న జిఎన్ఎం నర్సింగ్ స్కూల్ నందు కర్నూలు జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్ డాక్టర్ లింగన్న తానే స్వయంగా వెళ్లి జిఎన్ఎం నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ వినోదిని తో గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన శ్రావణి అనే అమ్మాయిని చేర్పించడం జరిగింది ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఆడపిల్లల్లో చాలామంది ఆణిముత్యాలు ఉన్నారని వాళ్లను మోటివేషన్ చేసి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కన్వీనర్ అన్నారు అమ్మాయి చదువుకుంటే ఆ కుటుంబమే బాగుపడినట్లే అమ్మాయిలు భవిష్యత్తుకు వెలుగంటూ ప్రభుత్వము విద్య వైద్యం పట్ల ఎక్కువగా మొగ్గు చూపుతోందని కన్వీనర్ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లి పద్మ మాట్లాడుతూ మా అమ్మాయిని జిఎన్ఎమ్ నర్సింగ్ స్కూల్లో చేర్పించినందుకు మాకు చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా కన్వీనర్ కు కృతజ్ఞతలు తెలపడం జరిగింది..

## ఎస్ ఎం ఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకునికి డాక్టరేట్ ప్రధానం.



అభినందిస్తున్న అధ్యాపక బృందం.

.విభారె న్యూస్ ఎమ్మిగనూరు ఫిబ్రవరి 9..స్థానిక శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డా.బి.క్రాంతి కుమార్ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్/సల్ఫైడ్ బేస్డ్ హెటిరోజంక్షన్ నానో కాంపోసిట్స్ ఫర్ గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్స్ అనే అంశం పైన ప్రొఫెసర్ విజయ కుమార్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ వారు డాక్టరేట్ ను ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు (ప్రిన్సిపాల్) డా.కె. మహబూబ్ బాషా మాట్లాడుతూ మా కళాశాలలో రసాయన శాస్త్ర విభాగాధిపతిగా వైస్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వర్తిస్తున్న డా.బి క్రాంతి కుమార్ రసాయన శాస్త్రంలో గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్స్ మీద ఎంతో మంచి పరిశోధన చేయడం వలన ఆయనకు ప్రముఖ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ రావడం ఎంతో ఆనందదాయకంగా ఉన్నదని అభినందనలు తెలియజేశారు. ఇలాంటి పరిశోధనలు మరెన్నో చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు, ఈ సందర్భంగా అధ్యాపకులు కళాశాల సూపరిండెంట్ మాట్లాడుతూ ఇలాంటి పరిశోధనల ద్వారా విద్యార్థిని విద్యార్థులు అందరూ పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# ఎన్డీఏ కూటమి 180 సీట్ల కన్నా గెలవదు..

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు: కే బాబురావు

విభారె న్యూస్ ఫిబ్రవరి 06 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి 180 సీట్ల కన్నా గెలువదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు తెలియజేశారు. మంగళవారం ఉదయం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ ఎన్డీఏలో 400 సీట్లు గెలుస్తామంటున్న మోడీ ఏ విధంగా గెలుస్తారో తెలియజేయాలని కేవలం గేమ్ ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ విన్నవిస్తుందని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మీకు కేవలం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 140 సీట్ల కన్నా రావని ఇది గుర్తుంచుకోవాలని ఎన్డీఏ కూటమి మొత్తం 180 సీట్లు దాటవని ఈ 9 సంవత్సరాలలో మీరు అత్యధిక మెజార్టీతో గెలిచారని దేశ ప్రజలు 2019లో పూర్తి మెజారిటీ ఇచ్చిన దేశ ప్రజలు బాధలు పడ్డారని నిరుద్యోగులు, ఉద్యోగాలు లేక ప్రజలు పనులు లేక పస్తులు ఉంటున్నారని మీ హయాంలో ప్రాజెక్టులు పరిశ్రమలు స్థాపించారా అని ప్రశ్నించారు. బిజెపి 1000 సంవత్సరాల అభివృద్ధి చేసిందని అంటున్నారే తప్ప కేవలం తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఒక లక్ష కోట్ల అప్పులు తెచ్చి మీరు వెయ్యి సంవత్సరాల అభివృద్ధి జరిగిందని ఎలా అంటారని ప్రశ్నించారు. మీరు అంబానీ, ఆధానీలకు దోచిపెడుతున్నారే అదిగొప్పతనంగా చెప్పుకోవాల అని ప్రశ్నించారు. ఓబీసీ అని చెప్పుకునే మోడీ మీ ప్రభుత్వంలో ఉన్నతాధికారులు ఎంతమంది ఓబీసీలు ఉన్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఎంత మంది మంత్రులు ఎంపీలు ఓబీసీలు ఉన్నారని ప్రశ్నించారు. పార్లమెంట్ సెక్రటేరియట్లో ఓబీసీ అధికారులు ఎంతమంది ఉన్నారో తెలియజేయాలని కేవలం 15% మాత్రమే ఓబీసీలు ఉన్నారని ఎస్సీ ఎస్టీలు మూడు శాతం మాత్రమే ఉన్నారని ఇదేనా మీ గొప్పతనం అని ప్రశ్నించారు. ఇదేనా బిజెపి గొప్పతనం అని కేవలం ఆర్ఎస్ఎస్ భావజాలంలో కేవలం మీరు కీలుబొమ్మలు మాత్రమే అని ప్రజలను తప్పుదో పట్టించడానికి మూడవసారి ప్రజల ముందుకు వస్తున్నారని మీకు వత్తాసు పలుకుతున్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మేమేమి తక్కువ కాదన్నట్లు వత్తాసు పలుకుతున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 140 సీట్లకు దాటవని మేము చాలెంజ్ విసురుతున్నామని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఈవీఎంలను వ్యతిరేకిస్తుందని బ్యాలెట్ పేపర్లు పెట్టమని సుప్రీంకోర్టులో కేసు వేయడం జరిగిందని తెలియజేశారు. ఇక రాష్ట్రానికి వస్తే విజయసాయి రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాలలోనే దేశం అభివృద్ధి చెందిందని అవినీతి జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే అని చెబుతున్నారని విజయసాయిరెడ్డి కాంగ్రెస్ ను వేలెత్తి చూపే అర్హత మీకు లేదని విమర్శించారు. అనంతరం మాజీ మంత్రి మూలింటి మారెప్ప గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ ని ప్రధాని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందని



రాష్ట్రంలో శ్రీమతి షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందని వైసీపీ పతనం ప్రారంభమైందని కాంగ్రెస్ పార్టీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని కాంగ్రెస్ పార్టీలో చైతన్యం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతను గౌరవించడం మనందరి కర్తవ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ డిసిసి ఉపాధ్యక్షులు బి బతకన్నా రియాజుద్దీన్ డిసిసి ప్రధాన కార్యదర్శులు షేక్ నవీద్, కె సత్యనారాయణ గుప్త, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ సుజాత రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు కొత్తపేట మున్నా సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏ లలిత కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్ జేమ్స్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఈవీఎంల స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

### జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06-త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జియం ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, పట్టణంలోని గోడౌన్ లోని భవనాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్ పిదప ఈవీఎంల భద్రతా భవనాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్ కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరం అవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అంతకుముందు నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో వున్న గోడౌన్ లోని భవనాలను కూడ ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూముల కొరకు కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. సబ్ డివిజన్ డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, డి.ఎస్.ఓ వెంకట్రాము డు, నంద్యాల తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యం తాసిల్దార్ ఫణి కుమార్ తదితరులు వారి వెంట ఉన్నారు.

## పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ : కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06- పట్టణంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు . ప్రతి వార్డులో పారి శుద్ధ్యంపై అధికారులు సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు . మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాలలో తిరుగుతూ శానిటేషన్ పనులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. శానిటేషన్ కార్మికులతో రోడ్ల డ్రైనేజీ లను శుభ్రం చేయిస్తున్నారు . కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్అంకిరెడ్డి. . డీఈలు మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి .శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ. శానిటేషన్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ సిబ్బంది ఉన్నారు

# యువతకు ఏదైనా సాధ్యమే:ఎన్.ఎమ్.డి ఫిరోజ్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06 నంద్యాల జిల్లాలోని ప్రభాత్ కళశాల నందు ఛైర్మన్ డా.బి.వి.సత్య నారాయణ ఆధ్వర్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న ఓటర్లతో ముఖముఖి నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర యువతీ యువకులకు అత్యంత ప్రతిభావంతులని పేరుందని అందుకు తగ్గట్టుగానే విభిన్న రంగాల్లో మన వాళ్లు అత్యున్నత స్థాయికి ఎదగాలంటే రాష్ట్రంలో సరైన విద్యా ఉపాధి అవకాశాలు లేక ఆంధ్ర యువత అంధకారంలోకి వెళ్ళడం దురదృష్టకరమన్నారు. అవినీతిని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా యువత ముందుండాలని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిదేందుకు యువత కీలకంగా వ్యవహరించాల్సిన సమయం వచ్చిందనియువగళం పాదయాత్రలో భాగంగా రాష్ట్రమంతా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్న నారా లోకేష్ సూచనలతో రాష్ట్రంలో యువత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని యువగళం పథకాన్ని టీడీపీ ప్రవేశపెట్టనుందని ఈ పథకం కింద యువత భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ 20 లక్షల మంది యువతకు ఉపాధి నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ఇప్పటికే చంద్రబాబు హామీ ఇచ్చారని కావున నంద్యాలలో ఎమ్మెల్యేగా ఫరూక్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుపూరి ఈశ్వర్.అలీ. సుహైల్ రానా.అలీమ్. జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా చేయాల్సిన కర్మ మాకేంటి

### భీమనిపల్లె వెంకట సుబ్బయ్య

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06- స్వంత ఆస్తులను కబ్జా చేయాల్సిన కర్మ మాకేంటని మాజీ కౌన్సిలర్ భీమనిపల్లె వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు . మంగళవారం పట్టణంలోగల మూలమట్టం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కబ్జాలు చేశారంటూ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. అన్యాయం జరిగి ఉంటే కోర్టులను ఆశ్రయించొచ్చుఅని సూచించారు. బుదదచల్లాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు . కనీస విచారణ చేయకుండా అసత్యాలు ప్రచరిస్తే ఎలా అని ప్రశ్నించారు. భీమనపల్లె కుటుంబం అంటే ఏంటో ప్రజలకు తెలుసని అన్నారు .గత 30 ఏళ్లకు పైగా అనుభవంలో ఉన్న తమ పోలాన్ని అక్రమంగా అన్ లైన్ చేసుకున్నారని తెలిపారు. న్యాయంగా పోరాడి చట్టపరంగా పొందామన్నారు . కబ్జాలు చెయ్యాల్సిన అవసరం మాకు లేదన్నారు . అన్యాయం జరిగింటే కోర్టులు ఉన్నాయని కావాలని ఆరోపణలు చేస్తే పరువునష్టంధవావేస్తాం అన్నారు. సొంత ఆస్తులను కబ్జా చెయ్యాల్సిన కర్మమాకేంటన్నారు.గత రెండు రోజులుగా వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చారు. మాజీ కౌన్సిలర్ భీమనపల్లె వెంకటసుబ్బయ్య వెంట ఆయన కుమారుడు పురంధర్ కుమార్ ఉన్నారు.



# పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈవో



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 06 – నంద్యాల జిల్లా మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్నటువంటి ఏపీ మోడల్ స్కూల్ తో పాటు, జడ్పీ హైస్కూల్ ను నంద్యాల జిల్లా డి.ఈ.ఓ సుధాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. మార్చి 18వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ రెండు కేంద్రాల్లో జరగనున్నాయి. అందులో భాగంగానే పరిశీలించి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రామసుబ్బయ్య కు పలు సూచనలు చేశారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190